# ఏం మగాళ్ళు!

**మన్నెం శారద**

## సాయంత్రం ఏడు గంటలవేళ!

నల్లకుంట కూరల మార్కెట్టులో కాయగూరలు కొంటోంది వాసంతి పెట్రోమాక్సు లైట్ల కాంతిలో నీళ్ళు జల్లిన కూరలు వనవలాడుతూ మెరుస్తోన్నాయి

"ఆకు కూరలు కొందామా" తన పక్కన నిలబడ్డ అమ్మాయి భర్తని అడుగుతోంది

"వద్దు!" అతను కేరట్ ఏరుతున్నాడు

వాసంతి అప్రయత్నంగా ఆ అమ్మాయి వేపు చూసింది ఆ అమ్మాయి మెడలోని పసుపుతాడు క్రొత్తగా, పచ్చగా మెరుస్తోంది కళ్ళలో తళుకు భర్తపట్ల చూస్తోన్న చూపుల్లో యింకా వీడని సిగ్గు- చూస్తుంటే క్రొత్తగా పెళ్ళయిన జంటని యిట్టే తెలిసి పోతోంది

"కేరట్ ఎలా చేస్తారు?" ఆ అమ్మాయి భర్తని మెల్లగా అడగడం వాసంతికి విన్పిస్తోంది

"నీకెందుకు, నేను చేసి చూపిస్తాగా!"

అతని మాటకు వులిక్కి పడ్డట్లుగా చూసింది వాసంతి.

వత్తయిన క్రాపు, గుండ్రని ముఖం, కోటేరేసినట్లున్న ముక్కు, చురుకయిన కళ్ళు- ఆ మాట— ఆ పెదవి వంపులో దాగిన చిరునవ్వు- వాసంతి అతని వేపు సంభ్రమంగా చూసి "అరుణ్!" అంటూ అరిచింది.

అతను అతనితో పాటూ ఆ అమ్మాయి ఆశ్చర్యంగా వాసంతి వైపు చూసేరు. వాసంతి చనువుగా అతని దగ్గర కొచ్చి "అరుణ్, నన్ను గుర్తుపట్టలేదా! మీ అక్కయ్యని!" అంది.

అరుణ్ గుర్తుపట్టినట్లుగా నవ్వి "బావ గారెక్కడ?" అన్నాడు "ఈ సరికి యింటి కొచ్చి వుంటారు ఆ సంగతి సరే! నాకు చెప్పకుండానే పెళ్ళి చేసుకున్నావన్న మాట! నాకేం చెప్పేవ్? నీకు కాబోయే భార్యని నేనే సెలక్ట్ చెయ్యాలని చెప్పలేదూ! చివరికి నన్ను పిలవటమే మరచి పోయేవన్న మాట!" వాసంతి నిష్ఠూరంగా మాట్లాడుతుంటే అరుణ్ చుట్టూ యిబ్బందిగా చూసేడు.

వాసంతి గమనించే స్థితిలో లేదు.

అరుణ్ భార్యవైపు చూసి "పోనీలే! నా ప్రమేయం లేకపోయినా చక్కని అమ్మాయినే కట్టుకున్నావ్! పేరేమిటి?" అంది మెచ్చుకోలుగా ఆమెవైపు చూస్తూ.

"ప్రసన్న" అరుణ్ చెప్పేడు.

"రండి, మా యింటికి కెళ్దాం, యిక్కడికి దగ్గరే!" వాసంతి ప్రసన్న చేయి ఆప్యాయంగా పట్టుకొంది

"ఇప్పుడు కాదు, మరో రోజు వస్తాం" అరుణ్ అభ్యంతరం చెప్పేడు

వాసంతి చిన్నబోయినట్లు చూసింది.

అయినా సమర్థించుకొన్నట్లుగా "పోని నీ ఎడ్రస్ చెప్పు! రేపు నేనే వస్తాను!" అంది

"విద్యానగర్ హౌస్ నెంబర్ సరిగ్గా గుర్తు లేదు! అయినా నేను వచ్చి తీసుకెళ్తానుగా!" అన్నాడు అరుణ్ సమర్థి



స్తున్నట్లుగా.

వాసంతి బుంగమూతి పెట్టింది

"మా యింటి ఎడ్రస్ తెలియకుండానే మా యింటి కొస్తావా? రావటం యిష్టం లేదని చెప్పు!" నిష్ఠూరంగా

అరుణ్ నవ్వేసేడు "సారీ అక్కయ్యా! మీ యింటికి రాకుండా ఎలా వుండగల నను కొంటున్నావ్!" అన్నాడు.

"సరే! నువ్వడగక పోయినా నేనే చెబుతున్నాను కోరంటి హాస్పిటల్ ఎదురుగా! మీ బావగారు పేరు చెబితే ఎవరయినా చెబుతారు అరుణ్ బద్ధకించినా నువ్వయినా తీసుకురా ప్రసన్నా!" అంటూ ప్రసన్న చేతిని ఆప్యాయంగా నొక్కింది వాసంతి.

ప్రసన్న నవ్వింది.

కూరగాయల బేరం అయ్యేక ఎవరింటికి వాళ్ళు బయల్దేరేరు.


o o o

వాసంతి కూరల బాస్కెట్టు తీసుకొని గాలిలో తేలుతున్నట్లు వుత్సాహంగా యింటివేపు అడుగులేసింది

అరుణ్ అనుకోకుండా కనిపించేడు! అరుణ్ ఎంత యేడు! అంటూ నవ్వుకుంది వాసంతి.
ఆమెకు విశాఖలో తామున్న రోజులు గుర్తొచ్చేయి!
—వాసంతిది క్రొత్త సంసారం
ఆమె భర్త ప్రకాశరావు స్టేట్ బ్యాంకులో పని చేసేవాడు
వాసంతి మొదటిసారిగా విశాఖపట్నం వచ్చింది
వాళ్ళెరు అప్‌లాండ్స్‌లో వుండేవాళ్ళు
వాసంతికి వంటరాదు కనీస ం కాఫీ పెట్టడం కూడ చాతగాదు
ప్రకాశరావు విసుక్కోకుండా వీలు ఉన్నంత వరకూ నేర్పుతుండేవాడు!
వాసంతి ప్రయత్నించి చేతులు కాల్చుకుంటు ఉండేది!
ఉడికి ఉడకని అన్నం— ఉప్పులేని కూరలు— నోట్లో పెట్టుకున్నప్పుడు తనెలా వండిందీ తెలిసి తెగ సిగ్గుపడి పోయేది వాసంతి
ప్రకాశరావు మరికాస్త వడ్డించుకొని— వాసంతి పాకశాస్త్రకౌసల్యాన్ని పొగుడుతుందీ వాసంతి నవ్వేసేది!
అదో మధురానుభూతి!
అద్దరూ అలా నవ్వుకుంటూ కాస్త ఎక్కువే తినేశారు!
తర్వాత తోచక స్కూటర్ మీద సెకండ్ షోలు!
హాల్ ఇరుగ్గా తోస్తే బీచ్ రోడ్‌లో షికార్లు, సముద్రపు టొడ్డున స్వప్నాలు!
క్వాలిటీలో అయిస్‌క్రీం!
-పెళ్ళయిన మొదటి రోజుల్లో చాలా సరదాగా తిరిగి ఎంజాయ్ చ్చేసినజంట వాళ్ళది!

౦ ౦ ౦

ఆరోజు ఆదివారం
ప్రకాశరావు చికెన్ తెచ్చి వాసంతికి అందించేడు
వాసంతి బాస్కెట్‌లోకి చూసి ఉలిక్కిడింది,
"ఇదేమిటి?" వికారంగా ముఖంపెట్టి అడిగింది.
"మొన్న ఆనంద్‌భవన్‌లో లొట్టలేసుకుంటూ తిన్నావే, అది!" ప్రకాశరావు నవ్వుతూ అన్నాడు
వాసంతి ముఖం చిన్నబోయింది
"నాకు చేతకాదు"! నీరసం ఆవహించేసింది ఆమెను
"నువ్వేం ఆడపిల్లవి! ప్రతిదీ రాదంటావ్" అన్నాడు ప్రకాశరావు విసుగ్గా
వాసంతికి కోపం వచ్చేసింది వస్తూన్న కన్నీళ్ళని అదిమిపట్టి కత్తి పీట తీసుకొని కోస్తూండగా "అక్కయ్యగారూ!" అన్న పిలుపు వినిపించింది
పదిహేడేళ్ళ అబ్బాయొకడు లోనికొస్తూ "రావొచ్చాండి!" అన్నాడు చనువుగా.
ప్రకాశరావు వాసంతివేపు 'ఎవరూ' అన్నట్లుగా చూసేడు
వాసంతి తెలియదన్నట్లు పెదవివిరిచింది.
ఆ అబ్బాయి వాళ్ళిద్దరి సందేహం తీరుస్తున్నట్లుగా "మేం పక్కింట్లోవుంటామండీ! మా అమ్మగారు మీకి కనకాంబరాలదండ యివ్వమంటే వచ్చేనండి!" అన్నాడు నవ్వుతూ.
విశాలమైన కళ్ళు, అమాయికమైనముఖం ముఖ్యంగా సిగ్గుపడకుండా కలుపుగోరుతనంగా మాట్లాడటం- వాసంతికీ,




ప్రకాశరావుకి కూడా నచ్చింది
వాసంతి చెయ్యికడుక్కుని పూలదండ అందుకుని పెట్టుకొంటూ "థాంక్స్ చెప్పు మీ అమ్మగారికి! మీ యింటిలో పూచినవా!" అంది
"అవునండి! రోజూ దండలుకట్టి మా అమ్మగారు దేవుడికి వేస్తారు! ఒక్కోసారి వీల్లేకపోతే అలాగే చెట్లకు రాలిపోతుంటాయి!" అన్నాడు
"మీ అమ్మగారు పెట్టుకోరా?" వాసంతి ప్రశ్న!
ఆ అబ్బాయి వాసంతికేసి అదోలా చూసి "మా నాన్నగారు లేరండి ˘ చనిపోయేరు!" అన్నాడు
వాసంతికి బాధ కల్గింది
మాట మారుస్తున్నట్లుగా "నీ పేరు?" అంటూ అడిగింది
"అరుణ్! ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాను" అన్నాడు "ఆ అబ్బాయిని నిలబెట్టే ఇంటర్వ్యూ చేస్తున్నావు కూర్చో అరుణ్! మనం కాఫీ తాగుదాం!" అన్నాడు ప్రకాశరావు అరుణ్‌ని కూర్చోబెడుతూ
వాసంతి లేచి కాఫీ కలిపి వాళ్ళిద్దరికీ చెరో కప్పు యిచ్చి మళ్ళీ చికెన్ గొడవలో పడింది
అరుణ్ వాసంతి వేపు చూసి నవ్వు ఆపుకుంటూ "అలా కోస్తున్నారేమిటి?" అన్నాడు
వాసంతి సిగ్గుపడింది
"మీ అక్కయ్య వంటలో ఎక్స్‌పర్ట్!" ప్రకాశరావు నవ్వేడు
"మీరు లేవండి నేను చూపిస్తాను!" అన్నాడు అరుణ్ వాసంతిని.
"నీకు వంటొచ్చా!" వాసంతి ఆశ్చర్యపోయింది
"చూస్తారుగా!" అరుణ్ వాసంతిని తప్పుకోమని చకచకా కోసి వండటం మొదలెట్టేడు
అతని ఆర్డర్స్ ప్రకారం వాసంతి కావాల్సినవి నూరుకొచ్చింది.
అతని వంట ప్రావీణ్యతకి ప్రకాశరావు

కూడా ఆశ్చర్యపోయి మెచ్చుకున్నాడు.

అలా అలా అరుణ్ వాళ్ళ కుటుంబానికి ఆప్తుడయిపోయేడు. ఈ రోజు వాసంతి వంట బాగా చేస్తోందంటే అది అరుణ్ చలవే!

వంటలోనే గాక ప్రతి విషయంలోను అరుణ్ వాసంతికి చేదోడుగా వుండే వాడు!

వాళ్ళిద్దరి మధ్య వచ్చే తగాదాలకి కూడ పెద్దమనిషిలా తీర్పులు చెప్పేవాడు.

అలా, అలా ఆర్నెల్లలో అరుణ్ వాళ్ళ మధ్య విడదీయలేని బంధంగా మారి పోయేడు.

ఒకోసారి అరుణ్, వాసంతి ఒక పార్టీగా మారి ప్రకాష్‌ని వుడికిస్తుండే వారు!

—గత జ్ఞాపకాలతో వాసంతి సన్నగా నవ్వుకుంటూ యిల్లు చేరింది.

వాసంతి వెళ్ళేసరికి ప్రకాశరావు పేపరు చదువుకుంటూ కూర్చున్నాడు.

వాసంతి వుత్సాహంగా బుట్ట పక్కన పెడ్తూ "అరుణ్ కన్పించేడండీ! అరుణ్ ఇక్కడే వున్నాడు!" అంది.

ప్రకాశరావు అనాసక్తంగా "ఎవరూ!" అన్నాడు.

వాసంతి చిరుకోపంగా చూసింది.

"అరుణ్‌ని మరచి పోయేరా! మన అరుణ్‌ని!" అంది నిష్ఠూరంగా.

"విశాఖపట్నంలో మొద్దబ్బాయూ?" అన్నాడు ప్రకాశరావు కొద్దిగా నవ్వుతూ.

వాసంతి బుంగమూతి పెట్టి "మా అరుణ్ మొద్దబ్బాయేం కాదు ఇంజనీరింగ్ పూర్తిచేసి యిక్కడ ఉద్యోగం చేస్తున్నాడట! పెళ్ళి కూడా చేసుకున్నాడు!" అంది గర్వంగా

"సర్లే! ఇంజనీరింగ్ చదివిన వాళ్ళంతా బ్రిలియంటేనా? ముందు పిల్లలకి భోజనం పెట్టు! వాళ్ళు నిద్రొచ్చి జోగ తున్నారు!" అన్నాడు ప్రకాశరావు పేపర్ పక్కకి పడేస్తూ.

వాసంతి తప్పుచేసిన దాన్లా గబుక్కున నాలిక్కరచుకుని- వెళ్ళి పిల్లల్ని భోజ నానికి తీసికెళ్ళింది.

వాళ్ళ భోజనాలయ్యేక వాసంతి, ప్రకాశ రావు కూర్చున్నారు.

అరుణ్ గురించి ప్రకాశరావు ఏమంత ఇంట్రెస్టు చూపించక పోవడం వాసంతికి నిరుత్సాహంగా వుంది

ఈ మగాళ్ళింతే! బిజినెస్ మైండెడ్! ఎక్కడుంటే అక్కడ మనుష్యులతో కాల క్షేపం చేసేస్తారు! అనుకుంది వాసంతి

"ఏమండీ మనం వాళ్ళని భోజనానికి పిలుద్దాం" అంది వాసంతి ప్రకాశరావు భార్యవేపు అదోలా చూసేడు

"ఇప్పుడంత తొందరేముంది? చూద్దాంలే!" అంటూ భోజనం ముగించేడు ప్రకాశరావు

వాసంతి మరింక మాట్లాడ లేదు.

ం ం ం

ఆ రోజు వాసంతి గాజుల షాపులో గాజులు బేరం చేస్తోంది!

"బాగున్నారా?"

వాసంతి వెనుతిరిగి చూసింది

ప్రసన్న!

వాసంతి ముఖం వికసించింది.

"బాగున్నాను. నువ్వొక్కతివే వచ్చావా!" అడిగింది వాసంతినవ్వుతూ

"అవునండీ! ఆయన ఆఫీసు కెళ్ళేరు

'గాజుల షాపుక్కూడా నేను రావాలా! అని కసరుకుంటారు దగ్గరేగా? అందు కని నేనే వచ్చేను!" అంటూ నవ్వింది ప్రసన్న

"పెద్ద మగాడయి పోయాడు వైజాగులో వుండగా నాకు ఒక్క గాజు లేవిటి. సవరాల షాపుక్కూడా సాయం వచ్చేవాడు!" అంటూ నవ్వింది వాసంతి

ప్రసన్నకూడా వాసంతి మాటలకి నవ్వాపుకోలేనట్లు నవ్వింది ఇద్దరూ బేరం పూర్తి చేసేక "రండి! మా యింటికెళ్దాం!" అంది ప్రసన్న.
వాసంతి కాదనలేదు

ఎలాగూ ప్రకాశరావు అప్పుడే రాడు, పిల్లలు స్కూల్నుంచి రావటానికి ఇంకా టైముంది.

ఇద్దరూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ ఇల్లు చేరుకున్నారు. ప్రసన్న వాసంతిని ఆదరంగా కూర్చోబెట్టి కాఫీ యిచ్చింది. "నువ్వు త్రాగవూ?" అడిగింది వాసంతి. "ఊహు! సహించడంలేదు!" అంది ప్రసన్న సిగ్గుగా కళ్ళు దించుకుని

వాసంతి అనుమానంగా చూసింది
"ఏమన్నా విశేషమా?" వాసంతి ప్రశ్నకు ప్రసన్న నవ్వి "ఊ!" అంది
"అదా సంగతి! నా దగ్గర సిగ్గెందుకు? నీ కేం యిష్టమో చెప్పు! చేసి తీసుకొస్తాను!" అంది వాసంతి సరదాగా
ప్రసన్న నవ్వింది.

"నిమ్మకాయ పచ్చడి కావాలా?" అంది వాసంతి చిలిపిగా నవ్వుతూ "నాకు పచ్చళ్ళు పెట్టడం రాదు." అంది ప్రసన్న అమాయకంగా.

"మీ ఆయిన కొచ్చుగా! సాయం చెయ్యడూ?" అడిగింది వాసంతి.
"ఎక్కడ? ఎప్పుడూ ఆఫీసే! టైముండదు!" అంది ప్రసన్న

"లేదులే! పెళ్ళానికి సాయం చేయటానికి నామోషి! నేను అడుగుతానుగా!" అంది వాసంతి.—


టైము నాలుగవుతోంటే వాసంతి వెళ్ళడానికి లేచింది "మీరిద్దరూ మా యింటికి రండి!" అని చెబుతూ ప్రసన్న నవ్వుతూ తల వూపి గుమ్మందాకా వచ్చింది

○ ○ ○ ○

ప్రకాశరావు ఆఫీసు కెళ్ళి పోయేక గబగబా తయారయి బుట్ట తీసుకుని వడివడిగా అడుగులేసింది వాసంతి.
అప్పుడే పోపు వేసిన దబ్బకాయ పచ్చడి సీసాలో పెట్టుకుని 'మొన్న యిచ్చిన నిమ్మకాయ పచ్చడి ప్రసన్నకి నచ్చిందో లేదో' అనుకుంటూ నడుస్తోంది వాసంతి
'అరుణ్ కూడ రుచి చూసే వుంటాడు! అప్పుడు తనకి వంట చెయ్యడం రాదని నవ్వేవాడు ఇప్పుడేమంటాడో చూడాలి!" అని నవ్వుకుంది వాసంతి
'ప్రసన్నతో స్నేహం కుదిరేకా తనకి బాగా కాలక్షేపమవుతోంది! ప్రసన్నని తనీరోజు యింటికి తీసుకెళ్ళాలి' అనుకుంటూ మెట్లెక్కసాగింది వాసంతి.
అరుణ్ ఇల్లు మేడమీద భాగంలో వుంది.

లోపల అరుణ్ గొంతు వినబడ్డంతో తక్కున ఆగిపోయింది వాసంతి.
తన పేరు వినబడ్డంతో తనకి తెలియకుండానే ఆ మాటలు వినసాగింది వాసంతి.
"ఆవిణ్ణి ఎక్కువ చేరనియ్యకు. పచ్చళ్ళూ గిచ్చళ్ళూ అంటూ పూసుకోవాలని చూస్తోంది!" అది అరుణ్ గొంతు.
"అలా అంటారేమిటి? పాపం చాల మంచావిడలా కనిపిస్తోంది. మీరంటే చాలా అభిమానం!" ప్రసన్న గొంతులో ఆశ్చర్యం!
"అందరూ మంచివాళ్ళే!నీకు తెలియదు, ఆవిడ కేరక్టర్ లూజు!"
"ఛ! అలా అనిపించడం లేదు నాకు!" ప్రసన్న గొంతులో అపనమ్మకం!
"నువ్వు నోర్మూసుకుని నా మాట విను! తెలియని సంగతులు నేను చెప్పను! ఆవిడ నాతోనే... నేను చిన్నవాణ్ణని లేకుండా రాసుకుని రాసుకుని మాట్లాడేది!" అరుణ్ కంఠంలో ఒలుకుతోన్న చులకన భావం!
వాసంతి మ్రాన్పడి పోయింది!
ఆమె కళ్ళనిండా అవమానంతో పొంగిన కన్నీళ్ళు!
ఆమె కారుతోన్న కన్నీళ్ళని తుడుచుకోవాలన్న ధ్యాసకూడా మరిచిపోయి గిరుక్కున వెను తిరిగి మెట్లు దిగి రోడ్డు మీద కొచ్చేసింది.
ఆమె మనసుమాత్రం అరుణ్ చేసిన అవమానాన్ని తట్టుకోలేకుండా వుంది.
అరుణ్ తన మీద ఇంత అభాండం వేస్తాడా?
వాసంతికి మతి పోతోంది!

ఆ రోజులు గుర్తొచ్చాయి!
—అరుణ్ ఇంజనీరింగ్ ఫస్టియర్ చదువుతున్నాడు.
ఆ రోజు ప్రకాశరావింకా ఆఫీసు నుండి రాలేదు.
వాసంతి బీరకాయలు చెక్కుతోంటే పక్కనే కూర్చొని కబుర్లు చెబుతున్నాడు అరుణ్.
వాసంతి వ్రేలు సర్రున తెగింది.
"బాబోయ్! రక్తం!" అరుణ్ కంగారు పడుతూ వాసంతి చేతిని పట్టుకున్నాడు. రక్తం చుక్కలు చుక్కలుగా కారుతోంటే గబుక్కున వాసంతి వేలు నోట్లో పెట్టుకున్నాడు.
"అదేం పని?" కసిరింది వాసంతి. సరిగ్గా అప్పుడే ప్రకాశరావు ఇంట్లోకి వచ్చేడు.
"బావగారూ! అక్కయ్య వేలు తెగింది!" అంటూ చెప్పేడు అరుణ్.
ప్రకాశరావు మాట్లాడలేదు!
"బావగారు సీరియస్‌గా వున్నారు. కాసేపున్నాక వస్తాను!" అంటూ వెళ్ళిపోయేడు అరుణ్.
"అలా వున్నారేం?" అడిగింది వాసంతి కాఫీ అందిస్తూ.
ప్రకాశరావు భార్య ముఖంలోకి చూసి "నువ్వు అరుణ్‌తో చనువు తగ్గించు!" అన్నాడు సీరియస్‌గా.
వాసంతి ఆశ్చర్యపోయి చూసింది.
"మీ మగబుద్ధి చూపిస్తున్నారు! అరుణ్ ఎంత పిల్లాడని!" అంది కోపంగా. "పసివాడు మాత్రం కాదు! అతనికి పంధొమ్మిదికి తక్కువ వుండవు! ఆవయసులో మగపిల్లలకు వచ్చే వింత ఆలోచనలు నీకు



తెలియవు!" అన్నాడు ప్రకాశరావు చిరాగ్గా.

వాసంతికి అర్థంకాలేదు

అరుణ్ మీద నింద వేయడం ఆమెకు నచ్చలేదు!

కాని తర్వాత ఆమె- ఆమెకు తెలియకుండానే అరుణ్ చర్యలు గమనించ సాగింది

జాతకం చూస్తానంటూ వాసంతి చేతిని పట్టుకున్నప్పుడు అతని చూపుల్లో తొట్రుపాటు- కాఫీ అందిస్తున్నప్పుడు చేతివ్రేళ్ళని తాకి సంతృప్తిపడే అతని చూపులు!

వాసంతి కోపం వచ్చినా నిగ్రహించుకొనేది!

తెలిసీ తెలియని వయసులో- వయసు వికసిస్తోన్న తరుణంలో పరిచయమైన స్త్రీ తనే కావటంవల్ల అతనలా ప్రవర్తిస్తున్నాడని సమర్థించుకొని తప్పుకుతిరిగేది, అతన్నొక నేరస్తుడిగా పరిగణించడానికి ఆమె మనసంగీకరించేదికాదు!

నువ్వే అరుణ్‌ని ఎంకరేజ్ చేస్తున్నావని ప్రకాశరావు కోపగించుకున్నప్పుడు ఏం చెయ్యాలో తోచేదికాదు వాసంతికి

"చిన్నవాణ్ని ఎలా నీచంగా అంచనా వేసి తప్పుపట్టేది?" అని బాధపడేది

అప్పుడే ప్రకాశరావుకి వూరు బదిలీ అయింది

—వాసంతి బాధగా నిట్టూర్చిం ది, తమ్ముడిలా చూసిన అరుణ్ తప్పుగా అంచనావేసి తనమీదే నిందవేసి నిందించటం- ఆమెకి చెప్పలేని బాధ కల్గింది. వాళ్ళ బలహీనతలు తనకేసి రుద్దడం...

"ఛీ! ఏం మగాళ్ళు!" అంటూ ఛీత్కారం చేసింది ఆమె అంతరంగం.

○ ○ ○